# గ్రామ పరిపాలనలో మార్పే గ్రామాభివృద్ధికి నిజమైన దిక్సూచి

**నిధుల కంటే చిత్తశుద్ధి ముఖ్యం**

**గ్రామసభ బలపడితేనే ప్రజాస్వామ్యం బలోపేతం**

**జవాబుదారీతనం, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యమే విజయసూత్రం**



భారతదేశం గ్రామాల సమాహారం. దేశ జనాభాలో అధిక శాతం ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తోంది. అందువల్ల దేశాభివృద్ధి గురించి మాట్లాడే ప్రతి సందర్భంలో గ్రామాభివృద్ధి ప్రస్తావన తప్పనిసరిగా వస్తుంది. అయితే అభివృద్ధి అనేది కేవలం కొత్త రోడ్లు వేయడం, భవనాలు నిర్మించడం, ప్రభుత్వ నిధులు ఖర్చు చేయడం మాత్రమే కాదు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను అందించడం, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందుబాటులో ఉంచడం, ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం వంటి అంశాల సమాహారమే నిజమైన గ్రామాభివృద్ధి. ఈ లక్ష్యాలను సాధించడంలో గ్రామ పంచాయతీల పాత్ర అత్యంత కీలకం.రాజ్యాంగంలోని 73వ సవరణ ద్వారా గ్రామ పంచాయతీలకు రాజ్యాంగబద్ధ హోదా కల్పించారు. అధికార వికేంద్రీకరణ, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం అనే లక్ష్యాలతో ఈ వ్యవస్థను బలోపేతం చేశారు. కానీ అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ గ్రామసభలు నామమాత్రంగా మారడం, అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం తగ్గిపోవడం, నిధుల వినియోగంలో పారదర్శకత లేకపోవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇవి గ్రామ స్వరాజ్య లక్ష్యానికి విరుద్ధం.గ్రామసభను గ్రామ ప్రజాస్వామ్యానికి గుండెకాయగా చెప్పవచ్చు. గ్రామంలోని ప్రతి కుటుంబం తమ సమస్యలను, అవసరాలను నేరుగా చెప్పుకునే వేదిక అదే. కానీ చాలా చోట్ల గ్రామసభలు సక్రమంగా నిర్వహించకపోవడం లేదా ప్రజలకు సమాచారం అందకపోవడం వల్ల వాటి ఉద్దేశం నెరవేరడం లేదు. గ్రామసభలో తీసుకునే నిర్ణయాలే అభివృద్ధి ప్రణాళికలకు పునాది కావాలి.పారదర్శకత లేకుండా పరిపాలన సాగితే ప్రజల్లో అనుమానాలు పెరుగుతాయి. పంచాయతీకి వచ్చిన నిధులు ఎంత? ఏ పనులకు ఖర్చు చేశారు? ఏ పనులు పూర్తయ్యాయి? ఏవి పెండింగ్‌లో ఉన్నాయి? వంటి వివరాలను బహిరంగంగా ప్రకటించడం ప్రజాస్వామ్య బాధ్యత. నేడు డిజిటల్ సాంకేతికత అందుబాటులో ఉన్న నేపథ్యంలో ప్రతి గ్రామ పంచాయతీ తన పనితీరును ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలి.గ్రామాల్లో ఇప్పటికీ తాగునీటి సమస్య, డ్రైనేజీ నిర్వహణ లోపాలు, రోడ్ల దుస్థితి, వీధి దీపాల సమస్యలు, చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. కొన్ని చోట్ల ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు, రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇవి కేవలం పరిపాలనా వైఫల్యాలే కాదు, భవిష్యత్ తరాల హక్కులకు కూడా భంగం కలిగించే అంశాలు. ప్రజా ఆస్తుల పరిరక్షణలో గ్రామ పంచాయతీలు రాజీపడకూడదు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత అత్యంత అవసరం. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు చేరాలి. మధ్యవర్తుల ప్రమేయం, రాజకీయ ప్రభావం, అవినీతి వంటి అంశాలకు తావులేకుండా వ్యవస్థ పనిచేయాలి. సేవలు ఆలస్యం కాకుండా, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డిజిటల్ సేవలను విస్తరించాలి.

గ్రామాభివృద్ధిలో యువత, మహిళా సంఘాలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల పాత్రను విస్మరించలేం. గ్రామ సమస్యల పరిష్కారంలో వారిని భాగస్వాములను చేయాలి. పరిశుభ్రత, హరితహారం, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, విద్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం వంటి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగితే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయి.

ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి చిత్తశుద్ధితో పనిచేయాలి. అధికారులు ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించే దిశగా స్పందించాలి. ప్రజలు కూడా గ్రామసభలకు హాజరై ప్రశ్నించే హక్కును వినియోగించుకోవాలి. ప్రజాస్వామ్యంలో హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.గ్రామం బాగుంటే మండలం బాగుంటుంది. మండలం బాగుంటే జిల్లా అభివృద్ధి చెందుతుంది. జిల్లా అభివృద్ధి చెందితే రాష్ట్రం పురోగమిస్తుంది. ఈ అభివృద్ధి గొలుసులో తొలి కడియం గ్రామ పరిపాలనే. అందుకే గ్రామ పంచాయతీలు రాజకీయ వేదికలుగా కాకుండా ప్రజాసేవా కేంద్రాలుగా మారాలి. పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యమైన అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం అనే నాలుగు సూత్రాలను కచ్చితంగా అమలు చేస్తేనే గ్రామ స్వరాజ్యం సాకారమవుతుంది.

గ్రామ పరిపాలన బలపడితేనే గ్రామాభివృద్ధి శాశ్వతమవుతుంది. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఒకే లక్ష్యంతో ముందుకు సాగితే ప్రతి గ్రామం ఆదర్శ గ్రామంగా నిలుస్తుంది. అదే నిజమైన అభివృద్ధికి నాంది.



సీనియర్ జర్నలిస్ట్ కొట్టే సుధాకర్ (లెనిన్)
టీయూడబ్ల్యూజే ( హై జేయు) జిల్లా
కార్యవర్గ సభ్యులు 9908401581

# మట్టి దందాపై ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే ఫైర్

**సునీల్ కుటుంబానికి న్యాయం కోరితే లాఠీచార్జ్ చేశారంటూ ఆరోపణలు**

**పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని విమర్శ**



**నర్సంపేట,/ జూలై 1 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఆయన అనుచరులు అనుమతులు లేకుండా అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యేకు చెందిన ఏజెన్సీ టిప్పర్ ఢీకొని యువకుడు సునీల్ మృతి చెందిన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులపైనే లాఠీలు ఝుళిపించడం దారుణమని మండిపడ్డారు.సునీల్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నిరసన చేపట్టిన వారిపై పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. 65 నుంచి 70 ఏళ్ల వృద్ధుడిపై కూడా లాఠీచార్జ్ చేయడంతో పాటు ఓ వ్యక్తిని తోసివేయడంతో ఆయన కిందపడిపోయారని చెప్పారు. టిప్పర్ ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోకుండా బాధితులనే లక్ష్యంగా చేసుకోవడం బాధాకరమన్నారు. పోలీసు అధికారులు చట్టాన్ని అమలు చేసే విధంగా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకే పోలీసులు లాఠీచార్జ్ చేశారని కూడా ఆయన ఆరోపించారు.రాష్ట్రంలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవహరించిన వారిని చట్టపరంగా వదిలిపెట్టబోమని ఆయన హెచ్చరించారు.విలేకరుల సమావేశంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్, నియోజకవర్గ కోఆర్డినేటర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీలు, ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్, నియోజకవర్గ సీనియర్ నాయకులు, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు, నెక్కొండ, పట్టణ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుల నిబద్ధతతోనే ప్రభుత్వ పాఠశాలలకు మెరుగైన ఫలితాలు

**ఖమ్మం జిల్లాను విద్యారంగంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ దివాకర టీఎస్**






**ఖమ్మం/, జూలై 1 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తేనే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. విద్యాశాఖ పనితీరులో ఖమ్మం జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి మండల విద్యాధికారులు (ఎంఈఓలు), కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, విద్యాశాఖ అధికారులతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థులుఉపాధ్యాయుల హాజరు, యూనిఫారాల పంపిణీ, యూడైస్ వివరాల నవీకరణ, ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని తరగతులతో పాటు ప్రీ-ప్రైమరీ తరగతుల్లోనూ విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈఓలు తమ పరిధిలోని ప్రతి పాఠశాలను తరచూ సందర్శిస్తూ హాజరు శాతం పెరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించిన అన్ని సూచీల్లో ఖమ్మం జిల్లా ముందంజలో నిలిచేలా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

యూడైస్ వివరాలను పూర్తిస్థాయిలో నవీకరించడంతో పాటు ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదును తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని, మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేలా సమర్థవంతమైన బోధన అందించాలని సూచించారు.డిజిటల్ వనరులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వంటి ఆధునిక సాంకేతికతను తరగతి గదుల్లో వినియోగించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ముఖ్యంగా పదో తరగతి ఫలితాలను మరింత మెరుగుపరిచేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. విద్యార్థుల్లో స్వయంగా చదివే, ఆలోచించే, భావవ్యక్తీకరణ చేసే నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉందని, అధికారులుఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే ఖమ్మం జిల్లా విద్యారంగంలో అగ్రస్థానంలో నిలుస్తుందని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు.సమావేశంలో ఇన్‌చార్జి డీఈఓ సదానందం, విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి. హెచ్. రామకృష్ణ, ఏఎంఓ పెసర ప్రభాకర్ రెడ్డి, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ తనిఖీలు చేపట్టాలి

**నర్సంపేట పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్**




**నర్సంపేట,/ జూలై 1 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో అగ్నిమాపక భద్రత (ఫైర్ సేఫ్టీ) నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, అన్ని విద్యాసంస్థల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని నర్సంపేట పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.పట్టణంలోని ఎన్ని పాఠశాలలకు ఫైర్ సేఫ్టీ అనుమతులు (ఫైర్ ఎన్ఓసీ) ఉన్నాయో, ఎన్ని పాఠశాలల్లో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేశారో, విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఫైర్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో అగ్నిమాపక శాఖ అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని కోరింది.విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రభుత్వం, విద్యాశాఖ, అగ్నిమాపక శాఖ సమన్వయంతో అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.విద్యార్థుల ప్రాణ భద్రతే ప్రభుత్వాల తొలి ప్రాధాన్యత కావాలని, ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో అవసరమని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

# డాక్టర్లే కనిపించే దేవుళ్లు

**డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు ఘన సన్మానం**






**తల్లాడ/, జూలై 1 (జర్నలిస్ట్ వార్త):** జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా తల్లాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులకు బుధవారం ఘన సన్మానం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్నాటి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ప్రత్యూషను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా కర్నాటి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రాణాలను కాపాడే డాక్టర్లు కనిపించే దేవుళ్లతో సమానమని అన్నారు. వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనదని, కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన వైద్యుల త్యాగం మరువలేనిదని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరం నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ (జెడ్‌సీ) వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, సీనియర్ సభ్యులు బెల్లంకొండ ఆంజనేయులు, కోడూరు నాగేశ్వరరావు, శీలం వెంకట్‌రెడ్డి, కటికి వెంకటేశ్వరరావు, జి. బాలకృష్ణ, కార్యదర్శి జి. సుధా నాయుడు, కోశాధికారి చల్ల రామాంజయ్య తదితరులు పాల్గొన్నారు.అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 7వ వార్డు సభ్యురాలు పెరిక స్వర్ణలత, కిరణ్‌కుమార్ వైద్యులను సన్మానించి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో అంకితభావంతో పనిచేస్తూ మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోశయ్యకు మంత్రి తుమ్మల పాదాభివందనం

**శతవసంత మహోత్సవంలో ఘన సన్మానం**



**మధిర/, జూలై 1 (జర్నలిస్ట్ వార్త):** వందేళ్ల జీవిత ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న రామిశెట్టి శెట్టి రోశయ్య శతవసంత మహోత్సవం బుధవారం దెందుకూరు సమీపంలోని విజయవాడ రోడ్డులోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై రోశయ్యకు పాదాభివందనం చేసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజంలోని అన్యాయాలపై కలాన్ని ఆయుధంగా మార్చుకుని నిరంతరం ప్రశ్నించిన వ్యక్తిగా రామిశెట్టి రోశయ్య నిలిచిపోయారని అన్నారు. శత వసంతాలు పూర్తి చేసుకున్నా ఆయనలోని సామాజిక చైతన్యం, ప్రజా సంక్షేమంపై అంకితభావం ఏమాత్రం తగ్గలేదని కొనియాడారు. కష్టజీవుల పక్షాన నిలిచి, శ్రమజీవుల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తెచ్చిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

మాజీ డీసీసీబీ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథన్, కాంగ్రెస్ నాయకుడు మొండితోక సుధాకర్ తదితరులు పాల్గొని రోశయ్యను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.కలమెత్తి ప్రశ్నించిన శ్రామికుడు.. శత వసంతాలు గడిచినా ఆగని పోరాట యోధుడు" అంటూ పలువురు వక్తలు రోశయ్య సేవలను స్మరించుకున్నారు.

## రాయప్ప జయంతి.. మానసిక దివ్యాంగులకు అన్నదానం



**మధిర,/ జూలై 1 (జర్నలిస్ట్ వార్త):** దివంగత గండమాల రాయప్ప జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు మానవతను చాటారు. మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయప్ప సతీమణి గండమాల లత, కుమారుడు సాయి, కుమార్తె అరుణశ్రీలు కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు స్వయంగా భోజనం వడ్డించి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా రాయప్ప సేవా స్ఫూర్తిని స్మరించుకుంటూ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.కేంద్ర నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలోని నిరాశ్రయులు, మానసిక దివ్యాంగులతో రాయప్ప జయంతిని సేవా కార్యక్రమంగా నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. భౌతికంగా దూరమైనా రాయప్ప జ్ఞాపకాలు, ఆయన సేవాభావం చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన గండమాల లత, సాయి, అరుణశ్రీలకు కేంద్ర నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి ఇంటికి పట్టా.. ప్రతి కుటుంబానికి ఇల్లు

**పేదలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆగదు: ఎమ్మెల్యే కూనంనేని -కలెక్టరేట్ వద్ద వామపక్షాల ధర్నా విజయవంతం**






**కొత్తగూడెం, /జూలై 1 (జర్నలిస్ట్ వార్త):** 'ప్రతి ఇంటికి పట్టా.. ప్రతి కుటుంబానికి ఇల్లు' నినాదంతో వామపక్ష పార్టీలు చేపట్టిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ముట్టడి, ధర్నా బుధవారం భారీ జనసందోహం మధ్య విజయవంతమైంది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు, వామపక్ష నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. పేదల ఇళ్ల కూల్చివేత చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. విద్యుత్ ఉద్యమం స్ఫూర్తితోనే పేదల గృహ హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఆక్రమణ స్థలాలను ప్రభుత్వం క్రమబద్ధీకరించి హక్కు పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. భూమిలేని ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం, ఇల్లు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.ధర్నాలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద సంఖ్యలో పేద కుటుంబాలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

**బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు - మురారి స్మితా కోటేష్ గౌడ్**

**సికింద్రాబాద్/జూలై 01(జర్నలిస్ట్ వార్త);** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు తార్నాక డివిజన్ పరిధిలోని బిఎల్ఓ అఖిల తో కలిసి ఇంటి ఇంటికి తిరుగుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం పై అవగాహన కల్పిస్తూ ఎన్యూమరేషన్ పాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు.



## మోండా డివిజన్లో ఘనంగా శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి 20వ వార్షికోత్సవ వేడుకలు



**సికింద్రాబాద్/జూలై 01(జర్నలిస్ట్ వార్త);** మోండా మార్కెట్ డివిజన్ కుమ్మరిగూడ లోని బుధవారం ఘనంగా శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి 20వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికి ఆ యొక్క అమ్మవారి ఆశీస్సులు ఎల్లపుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## బౌద్ధనగర్ డివిజన్లో ఎస్ఐఆర్ కార్యక్రమం



**సికింద్రాబాద్/జూలై 1(జర్నలిస్ట్ వార్త);**మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం బౌద్ధనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ అధ్వర్యంలో ఎస్ఐఆర్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ యువకులు తీగుళ్ళ కిషోర్ గౌడ్ పాల్గొని ఇంటి ఇంటికి తిరుగుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పిస్తు ఎన్యూమరేషన్ పాత్రలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ నేడు పచ్చ నోటుకు అమ్ముడుపోయి ఓటేస్తే.. రేపొద్దున కచ్చరోడ్డుపైనే ప్రయాణం చేయాలి.ఆలోచించి ఓటు వేయూ, అభివృద్ధికి కి ఓటు వేయాలని పేర్కోన్నారు. అదేవిధంగా ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, రాజేష్, సిలం సాయి, పాక సాయి, యాద క్రాంతి, కలిం, బాబా, ముజఫర్, ఇమ్రాన్, సుమలత, సుజాత, గీత, మానస, నందిత తదితరులు పాల్గొన్నారు.

# కంబాలపల్లి సోసైటీ సబ్ సెంటర్ లో అధిక ధరలకు యూరియా అమ్మకాలు

**-యూరియా బస్తాకు రూ..285 కు అమ్మకాలు....!**

**-గిరిజన రైతులను దోచుకుంటున్న సబ్ సెంటర్ ఇంచార్జ్...!**

**-ఏజెన్సీ రైతుల అమాయకత్వంతో లక్షల్లో దోపిడి...!**

**-అధికారుల తనిఖీలు శూన్యం...!**

**-అక్రమాలు పాల్పడుతున్న సిబ్బందిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.**




**బయ్యారం/జులై 1(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా రైతులకు ఎరువులు,విత్తనాలు అందించేందుకు మండలంలో 5 సొసైటీ సబ్ సెంటర్స్ ను జిల్లా అధికారులు ఏర్పాటు చేశారు.వాటిలో కంబాలపల్లి,లక్ష్మీపురం సబ్ సెంటరులలో యూరియా బస్తా 266 రూపాయలకు అమ్మకాలు జరపాల్సి ఉండగా సొసైటీ ఇంచార్జ్ 285 రూపాయలకు అమ్ముతున్నట్లు రైతులు చెబుతున్నారు.యూరియా బస్తాకు అదనంగా 19 రూపాయలు తీసుకుంటున్నట్లు రైతుల చెబుతున్నారు.ప్రభుత్వం సబ్సిడీపై అందించే యూరియా బస్తా అధికారిక ధర దాదాపు రూ.266 అమ్మాలి..ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కాకుండా ఎక్కువ ధరకు యూరియ అమ్మకాలు జరురుపుతూ గిరిజన రైతులను సొసైటీ ఉద్యోగులు నిలువునా దోపిడీ చేస్తున్నారు.రైతుకు ఇచ్చే బిల్లులో 266 రూపాయలు రాసి, రైతు దగ్గర బస్తాకు 285 తీసుకోవడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.జూన్ 1 నుంచి కంబాలపల్లి, లక్ష్మీపురం సొసైటీ సబ్ సెంటర్లకు సుమారు 2 వేల యూరియా బస్తాలు దిగుమతి అయ్యాయి.అన్ని యూరియా బస్తాలను 285 చొప్పున అమ్మకాలు జరిపారు.సోసైటీ సబ్ సెంటర్ల నిర్వహణపై జిల్లా సహకార సంఘ అధికారుల తనిఖీ లేకపోవడంతో యూరియా అక్రమాల్లో పలువురు అధికారులకు మామూళ్లు ఇస్తుండడం వల్లే ఈ తతంగం జరుగుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.దీనిపై జిల్లా సహకార సంఘ అధికారులు విచారణ చేపట్టి, రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు యూరియా బస్తాలను అందించాలని మండల రైతులు కోరుతున్నారు. అధిక ధరలకు యూరియా అమ్మకాలు జరుపుతున్న సోసైటీ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### 1) యూరియ బస్తాకు 285 తీసుకుంటున్నారు.

**నారాయణపురం సర్పంచ్.సొలం బాలకృష్ణ.**

కంబాలపల్లి సోసైటీ సబ్ సెంటర్లో మూడు రోజుల క్రితం యూరియ తీసుకున్నాను. బస్తాకు 285 రూపాయల చొప్పున తీసుకున్నారు.



### 2) జనార్దన్ కంబాలపల్లి రైతు.

కంబాలపల్లి సోసైటీ సబ్ సెంటర్ లో 5 బస్తాల యూరియా తీసుకున్న.నా దగ్గర బస్తాకు 285 చొప్పున 1425 రూపాయలు తీసుకున్నారు. మాకు చదువు రాదని ఇలా మోసం చేస్తారా..! సహకార సంఘ సబ్ సెంటర్ అంటే మోసమేనా...



జనార్దన్ కంబాలపల్లి రైతు.

### బయ్యారం సహకార సంఘ సీఈవో అనూష.

దీనిపై సీఈఓను వివరణ కోరగా బయ్యారం మండలంలోని రైతు సహకార సంఘం సబ్ సెంటర్లలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువగా ధరకు యూరియా కట్టలు అమ్మితే జిల్లా అధికారులకు పిర్యాదు చేస్తామన్నారు.సిబ్బంది ఎవరైనా యూరియా అమ్మకాల్లో అధిక రేట్లు వసూలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

## కొత్తపేటలో మంచినీటి బావికి స్టీరింగ్ నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్.

**బయ్యారం/,జులై 1.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం గంధంపల్లి-కొత్తపేట గ్రామంలో గ్రామ ప్రజలకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో గత నెలలో గ్రామస్తులు,అన్ని రాజకీయ పార్టీల నాయకులు,గ్రామ పెద్దల సమక్షంలో తవ్విన మంచినీటి బావికి ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సిఫారసు మేరకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ డిఎంఎఫ్టీ నిధులు రూ.4.50 లక్షలు బావి చుట్టూ స్టీరింగ్ నిర్మాణానికి మంజూరు చేశారు. అందులో భాగంగా సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు,ఏఈ సమక్షంలో స్టీరింగ్ నిర్మాణ పనులను ప్రారంభించారు.అనంతరం సర్పంచ్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు.అలాగే గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ రమేష్,కోటేశ్వరరావు,ఆనందరావు,కారుబోతుల రాంమ్మూర్తి, గౌడ కుల సంఘ నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ సభల ద్వారా భూముల రీ-సర్వే పనులు వేగవంతం చెయ్యాలి.

**-తహసీల్దార్ నాగరాజు.**



**బయ్యారం/,జులై 1.(జర్నలిస్ట్ వార్త)** గ్రామ సభల ద్వారా భూముల రీ-సర్వే పనులు వేగవంతం చేయాలని బయ్యారం మండల తహసీల్దార్ నాగరాజు పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా బయ్యారం మండలంలోని సింగారం గ్రామపంచాయతీలో భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహణ సదస్సును సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్బంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు ఈ భూ సర్వేకు సహకరించాలని కోరారు.అలాగే సంబంధిత అధికారులు ప్రజల సహకారంతో భూ రిసర్వే విషయంలో కచ్చితంగా సర్వే పనులు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చుంచు మమత,ఆర్ఐ, సర్వేయర్,జిపిఓ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

